క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ


ఎస్‌ఐ హనుమంత్‌రెడ్డి

దొర్నిపాడు: మండల ఎస్‌ఐగా హనుమంత్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ మెడికల్ లీవ్‌లో వెళ్లారు. అందరూ ఊహించినట్లే సెల వుల్లో వెళ్లిన ఆయన రాలేదు. నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే తన లక్ష్యం అన్నారు. మట్కా, జూదం, బెల్టు షాపులు వంటి అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

నెలరోజులుగా ఎస్‌ఐ లేక..
నెల రోజులుగా ఎస్‌ఐతో పాటు సిబ్బంది లేక ముగ్గురు నలుగురితో విధులు నిర్వహించలేక ఉన్న పోలీసులు ఇబ్బందులు పడేవారు. దీంతో ఈనెల 7న 'ఠాణా ఖాళీ' అనే వార్తను సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు ఐదు రోజుల్లోనే నూతన ఎస్‌ఐ హనుమంత్‌రెడ్డిని నియమించారు. అలాగే కంప్యూటర్ ఆపరేటర్ అమీర్‌ను డిప్యూటేషన్‌పై పంపారు. దీంతో పోలీస్ స్టేషన్లో హర్షం వ్యక్తం అవుతుంది.

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య


కొండాపురంలో ఫార్మర్ రిజిస్ట్రీ వివరాలను పరిశీలిస్తున్న ఏఓ

దొర్నిపాడు: రైతు రిజిస్ట్రీ ద్వారా ఇక నుంచి ప్రతి రైతుకు 11 నెంబర్లతో యూనిక్ కోడ్ కేటాయించనున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రమీల తెలిపారు. బుధవారం మండలంలోని కొండాపురం గ్రామంలోని రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు పొందాలంటే భూ యజమానులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలన్నారు. ఈ ఐడీని ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు లింకేజీతో కూడిన ఆర్థిక సేవలతో పాటు పటలకు కనీస మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డు, మొబైల్ తీసుకొని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై కొనసాగుతున్న విచారణ


బీరవోలులో విచారణ చేస్తున్న అధికారులు

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లపై ఫిర్యాదులు అందుతుండటంతో ఉన్నతాధికారులు విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ పూర్తి చేశారు. రెండు రోజుల క్రితం చిత్రేనిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీడీ విచారణ చేశారు. బుధవారం బీరవోలు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీడీ సాంబశివరావు విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ శ్రావణికి బదులుగా ఆమె తండ్రి విధులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో విచారణ జరిపామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏపీడీ తెలిపారు.

పాఠశాలకు టీవీ అందజేత

నంద్యాల (వ్యవసాయం): నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక చిన్మయ మిషన్ పాఠశాలకు భవనాశి వెంకటసుబ్బయ్య శెట్టి, శ్రీమతి వెంకమ్మ ట్రస్ట్ తరపున, క్లబ్ జిల్లా చైర్మన్,ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షుడు భవనాశి నాగ మహేష్ తమ తండ్రి భవనాశి శ్రీరామమూర్తి జ్ఞాపకార్థం విద్యా బోధనలో ఉపయోగించడానికి రూ.10 వేల విలువజేసే టీవీని బుధవారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్,, కోశాధికారి మామిళ్ల నాగరాజు,చిన్మయ మిషన్ స్కూల్ అధ్యక్షులు ఆంజనేయులు గుప్తా, కార్యదర్శి కొశెట్టి కష్ణమూర్తి పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు తయారీ చేపట్టండి


స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

చాగలమర్రి: ఈ నెల 15వ తేదీ నాటికి మండలంలో ఉన్న 14 ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లలో మైనర్ రిపేర్లు ఉంటే చేయించి వర్మీకంపోస్టు ఎరువు తయారీ పనులు చేపట్టాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం స్వచ్ఛత దివస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మూడు వర్షపు నీటిని శుద్ధి పరిచే గుంతలు (సోక్ పిట్స్)ను తక్కువ ఖర్చుతో స్థానికంగా లభించే వనరులతో నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం సూచించారు. ఈఓపీఆర్‌డీ తాహెర్ హుసేన్, ఏఈ జగ్గయ్య, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, పంచాయితీ కార్యదర్శులు, ఇంజనీరింగు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

- అర్హులందరికీ పింఛన్లు ఇస్తామన్న కూటమి నాయకులు
- ప్రభుత్వం వచ్చి 8 నెలలు అవుతున్నా మంజూరు కాని పింఛన్లు
- నేటికి తెరుచుకోని సంబంధిత వెబ్‌సైట్
- ఉన్న వాటినే తొలగించే చర్యలు మరూ!
- ఎదురుచూస్తున్న ఆశావహులు

కొత్త పింఛన్లు అందేనా?


జూలేపల్లె సచివాలయంలో పింఛన్ కోసం సిబ్బందిని అడుగుతున్న వృద్ధుడు

గోస్పాడు: పింఛన్లు పొందుతున్న వారితో పాటు కొత్తగా ఎదురుచూస్తున్న వారిలో ఆందోళన నెలకొంది. కొత్తవాటిని మంజూరు చేయకపోగా.. ఉన్న వాటిని తొలగించేందుకు ఇప్పటికే కూటమి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఎన్నికల సమయంలో అర్హులందరికీ పింఛన్లు ఇస్తామని కూటమి నాయకులు హామీనిచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా ఇప్పటి వరకు వాటి గురించి ప్రస్తావించని పాపాన పోలేదు. గతేడాది అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంతవరకు కార్యాచరణ రూపొందించలేదు. కనీసం పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ కూడా తెరవలేదు. అలాగే..గత ప్రభుత్వంలో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రస్తుతం గోస్పాడు మండలంలో 5,527 పింఛన్లు, నంద్యాల మండలంలో 7052 పింఛన్లు ఉన్నాయి. అయితే సుమారు వెయ్యి నుంచి 1,500 మంది దాకా అర్హులైన పింఛన్‌దారులు కొత్త వాటి కోసం ఎదురుచూస్తున్నారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాలకు వెళ్లి పింఛన్ మంజూరుపై సిబ్బందిని అర్హులు ప్రశ్నిస్తున్నారు. ఇంకా వెబ్‌సైట్ తెరుచుకోలేదని చెబుతున్నప్పటికీ వారి నుంచి అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి.

అర్హత ఉన్నా తప్పని ఎదురుచూపులు..
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా అర్హతే కొలమానంగా 60 ఏళ్లు నిండిన వెంటనే వలంటీర్లు దరఖాస్తు పూర్తి చేసి సచివాలయంలో ఇస్తే పింఛన్లు మంజూరయ్యేవి. ప్రస్తుత ప్రభుత్వంలో పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు గత ప్రభుత్వంలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారు కూడా నిరీక్షిస్తున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు రోజూ ఆయా గ్రామాల్లో అర్హులు వెళ్తున్నా ఫలితం లేదు. ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తుంది.

గత ప్రభుత్వంలో పక్కాగా..
వైఎస్సార్ సీపీ పాలనలో పింఛను దరఖాస్తు చేసుకున్న వెంటనే అందించేవారు. అప్పట్లో ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం పింఛన్లు వెబ్‌సైట్ పూర్తిగా నిలిపివేసింది. దీంతో కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని భావించిన వారు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా వారి సమస్యకు పరిష్కారం కనుచూపుమేరలో కూడా దొరికే పరిస్థితి లేదని నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ఉన్న పింఛన్లను తొలగించే కుట్ర..
కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు. ప్రస్తుతం వస్తున్న పింఛన్లను తొలగించే చర్యలు చేపడుతుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇతర ప్రాంతాల వైద్యులు, అధికారులతో లబ్ధిదారుల అర్హతను పరిశీలిస్తున్నారు. దీంతో ఎవరిపై అనర్హత వేటు వేస్తారోనని వారిలో భయం నెలకొంది. ముఖ్యంగా టీడీపీ నాయకులు చెప్పిన వారికే పింఛన్లు ఇవ్వాలని అధికారులకు మౌఖికంగా ఆదేశాలు అందాయని, వారి సూచనతో ఎంతమందిని అనర్హులుగా తేలుస్తారోనని అర్థం కాని పరిస్థితి నెలకొంది.

విశేష పూజలు


పూజలందుకున్న జ్వాలా వీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోనూ, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామి వారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

14న బహిరంగ వేలం

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఈనెల 14న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ రామకృష్ణ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో టెంకాయలు, పూలు, గాజులు, దేవుళ్ల ఫొటోలు విక్రయించుకునేందుకు వేలం నిర్వహిస్తామన్నారు. టెంకాయల అంగళ్లకు రూ.లక్ష, మిగితావాటికి రూ.10వేలు చొప్పున దరవాత్తు చెల్లించాలన్నారు.

జంబులమ్మకు ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

బొమ్మలసత్రం: పట్టణ శివారులో వెలసిన జంబులా పరమేశ్వరీమాత బోనాల పండుగ సందర్భంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. జంబులాపరమేశ్వరి ఆశీర్వాదాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబ దేవతగా అమ్మవారిని కొలుస్తామని చెప్పారు.

కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను వ్యతిరేకించండి

నంద్యాల(న్యూటౌన్): స్వదేశీ, విదేశీ కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను వ్యతిరేకించాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయంలో లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వామపక్షపార్టీల నాయకులు తోటమద్దులు, గౌస్, నరసింహ, బాలవెంకట్ మాట్లాడుతూ కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్యతరగతి వర్గాలకు ఆదాయ పన్నులో తప్ప మిగిలిన రైతు, కార్మిక వర్గాలకు ఒరిగిందేమి లేదన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి మార్గాలు చూపించలేదని, పెరుగుతున్న ధరలను నియంత్రించడానికి ఎలాంటి చర్యలు పేర్కొనలేదన్నారు. ఉపాధిహామీ పథకానికి నిధులు కేటాయించకపోవడం, ఏపీ విభజన చట్టంలో హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. విశాఖ రైల్వేజోన్, కడప స్టీలు ప్లాంటు కేంద్ర విద్యాసంస్థలైన ట్రిపుల్ ఐటీ, ఎయిమ్స్, సెంట్రల్, గిరిజన యూనివర్శిటీలకు కేటాయింపులు చేయకపోవడం బాధాకరమన్నారు. నూతన ప్రాజెక్టులు, రైల్వేలైన్ కేటాయించక పోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు. పది వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల16వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యక్రమాలు ప్రకటిస్తామని చెప్పారు. లింగం, రఫీ, రవిరాజు, రాంబాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


పడిగెపాడులో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ పరిశోధన కేంద్రం శిక్షకులు చెన్నయ్య

ఉయ్యాలవాడ : ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శిక్షకులు చెన్నయ్య రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పడిగెపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు జీవామృతం, గణామృతం తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పంటల సాగుకు రైతులు భారీగా రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తున్నారని దీంతో పెట్టుబడులు అధికమవుతున్నాయన్నారు. ఇటువంటి సమయంలో ప్రకృతి విపత్తులు సంభవిస్తే కోలుకోలేరన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. కోవెలకుంట్ల వ్యవసాయ సంచాలకులు సుధాకర్ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని 6 మండలాల్లో 55 వేల మంది రైతులున్నారని, వీరందరికి రైతు గుర్తింపు నంబర్ ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు 3 వేల మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయిందని, నెలాఖరులోగా మొత్తం ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేసిన 50 వేల హెక్టార్లలో ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేశామని తెలిపారు. 16,500 మంది రైతులు 27,759 హెక్టార్లకు సంబంధించి రూ.56,59,512 బీమా ప్రీమియం చెల్లించినట్లు వెల్లడించారు. మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన

బేతంచెర్ల: అడవులను అగ్ని బారి నుంచి కాపాడటం, వన్యప్రాణులను రక్షించడంతో పాటు పలు అంశాలపై పాణ్యం రేంజ్ అటవీ అధికారులు అవగాహన కల్పించారు. బుధవారం మండల పరిధిలోని సీతారామాపురం, ముద్దవరం గ్రామాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. అనంతరం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ అనీల్‌కుమార్ మాట్లాడారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తప్పవు


హద్దు రాళ్లను జేసీబీ సాయంతో తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

నందికొట్కూరు: అక్రమ వెంచర్లపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బేబి హెచ్చరించారు. బుధవారం పట్టణ సమీపంలోని నాగులూటి రోడ్డు వైపు వెలిసిన అక్రమ వెంచర్లను మున్సిపల్ అధికారులు ధ్వంసం చేశారు. వెంచర్లలో వేసిన ప్లాంట్ల రాళ్లను తొలగించి మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటి అనుమతులు లేకుండా వెంచర్ల వేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు వచ్చాక ప్లాంట్లు వేయాలని ఆదేశించారు. ఇష్టానుసారంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేస్తే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. నంద్యాల రోడ్డు, నాగలూటి రోడ్డు వైపు 761, 852ఎ, 809 సర్వే నంబర్లలో మూడు వెంచర్ల సంబంధించిన 11 ఎకరాలు వేసిన వెంచర్లను జేసీబీ ద్వారా పోలీసుల సహాయంతో రాళ్లను తొలగించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లాన్ ఆఫీసర్ రంరస్వామి, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, పోలీసులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం


కాశీ విశాలక్షి, విశ్వేశ్వర స్వామికి కల్యాణం నిర్వహిస్తున్న గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమాన్‌పురం గ్రామంలో వెలసిన కాశీ విశాలక్షి, విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం కమనీయంగా నిర్వహించారు. మాఘ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని స్వామి అమ్మవార్లకు ఉదయం ప్రాతఃకాల పూజలు, రుద్రాభిషేకం, మహామంగళహారతి, పూర్ణాహుతి ప్రత్యేక పూజల అనంతరం కల్యాణోత్సవం కనులపండువగా జరిపారు. సాయంత్రం మేల తాళాలతో స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామ రైతు సంఘం, దాతల సహకారంతో జిల్లాస్థాయి 4 పండ్లలోపు వృషభ రాజములకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరై పోటీలను ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో కోడుమూరు మండలం శశాంక్ వృషభాలు ప్రథమ, బేతంచెర్ల మండలం, భానుజ వృషభాలు ద్వితీయ, దొర్నిపాడు మండలం, మనోహర్ యాదవ్, వైఎస్సార్ జిల్లా దీపరాజునాయుడు వృషభాలు సంయుక్తంగా తృతీయ, నంద్యాల జిల్లా, కొత్తపల్లి మండలం ప్రసాద్, వైఎస్సార్ జిల్లా ప్రతాప్‌యాదవ్ వృషభాలు సంయుక్తంగా నాల్గవ, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి వృషభాలు 5వ, నంద్యాల జిల్లా శిరివెల్ల మండలం సిద్ధయ్య వృషభాలు 6వ స్థానం కైవసం చేసుకోగా దాతల సహకారంతో వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల నగదు బహుమతులను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు


హోమాల్లో పాల్గొన్న భక్తులు

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో వెలసిన స్పటిక లింగేశ్వర ఆలయంలో బుధవారం మాఘమాస పౌర్ణమి, శ్రీ లలితా దేవి జయంతి సందర్భంగా స్వామి యోగానంద ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్పటిక లింగేశ్వరునికి ప్ర త్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు అన ంతరం యోగా గురువు శ్రీ అచల పరిపూర్ణ యో గానంద పాములేటి స్వామి వారికి పంచామృతాభిషేకం, తదనంతరం లోక కల్యాణార్థం ప్రత్యేక హోమాలు, పూర్ణాహుతి గావించారు.

చేతి పంపులకు మరమ్మతులు

ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లె గ్రామంలో చేతి పంపులకు మరమ్మతులు చేపట్టినట్లు స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ రమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బోర్ల ను పరిశీలించి మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. కొండుపల్లెలో 9 బోర్లు ఉండగా 8 చేతి బోర్లకు మరమ్మతులు చేశామన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం

నంద్యాల(వ్యవసాయం): దేశాభివృద్ధి ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మదు పేర్కొన్నారు. బుధవారం గోస్పాడు మండలం వెంకటాపురం గ్రామంలో పర్యటించారు. పార్టీ గోస్పాడు మండల అధ్యక్షుడు మధు గోపాల్, నాయకులు చల్లా మధు, కొశెట్టి చంద్రశేఖర్ శివ రామిరెడ్డి పెద్దాచారి చెన్నకేశవ పాల్గొన్నారు.

లక్ష కుంకుమార్చన


లక్ష కుంకమార్చన పూజ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపించారు. భక్తులు పరోక్షసేవగా పాల్గొనే అవకాశం ఉండటంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, తదితర ప్రాంతాల నుంచి పూజలను నిర్వహించుకున్నారు. లక్ష ముందుగా పూజా సంకల్పం పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ, అనంతరం లక్ష కుంకుమార్చన జరిపించారు.

కంది దిగుబడికి నిప్పు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన రైతు చెన్నయ్యకు సంబంధించిన కంది పంట దిగుబడి అగ్నికి ఆహుతైంది. పట్టణ సమీపంలోని సాక్షి నివాస్ సమీపంలో రైతుకు ఉన్న 12 ఎకరాల పొలంలో కంది పంట సాగు చేశారు. పంటను కోత కోసి నూర్పిడి కోసం ఒకచోట ఉంచగా బుధవారం రాత్రి మంటలు వ్యాపించి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. మంటలు చెలరేగడం గమనించిన స్థానికులు అగ్రిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. కంది దిగుబడికి ప్రత్యర్థి వర్గం వారు నిప్పు పెట్టి ఉంటారని బాధిత రైతు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.


అహోబిలేశుడి పూజల్లో పాల్గొన్న భక్తులు

గూబగుండంలో అహోబిలేశుడికి ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ: అహోబిలం శ్రీలక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవ పల్లకీ బుధవారం గూబగుండంలో గ్రామంలో కొలువుదీరింది. దేవరాయపురంలో పూజలందుకున్న ఉత్సవమూర్తులు మంగళవారం అర్ధరాత్రి గూబగుండం చేరుకోవడంతో గ్రామస్తులు గ్రామ పొలిమేర వరకు ఎదురేగి ఉత్సవ పల్లకీకి సంప్రాదాయబద్ధంగా స్వాగతం పలికి మొదటి తెలుపుపై కొలుదీర్చారు. ఉత్సవమూర్తులు జ్వాలానరసింహ స్వామి, శ్రీ ప్రహ్లాద వరదస్వాములను గ్రామస్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

స్టెమీ ప్రాజెక్టుపై అవగాహన


సమావేశంలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

గోస్పాడు: ప్రభుత్వ అసుపత్రుల్లో నిర్వహించే స్టెమీ ప్రాజెక్టుపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని వైద్యాధికారులు గోపాల్, గోవర్ధన్‌రెడ్డి, శ్రావణి అన్నారు. బుదవారం యాల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య సిబ్బందికి, ఆశా వర్కర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్టెమీ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశం, గుండె సంబంధ సమస్యలు వస్తే వెంటనే ఎలాంటి చర్యలు చేపట్టాలో వివరించారు.

గుండెను ఇబ్బంది పెట్టొద్దు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ షేక్షావలి

దొర్నిపాడు: గుప్పెడంత గుండెను ఇబ్బంది పెట్టకుండా ఆహారపు అలవాట్లను మార్చుకోవడంతో పాటు వ్యాయమం తప్పనిసరిగా చేయాలని గుండె వైద్య నిపుణులు డాక్టర్ షేక్షావలి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో నాగేంద్ర ఆధ్వర్యంలో శాంతిరాం వైద్యశాల బృందం ఉచిత గుండె, కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మందికి గుండె పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఈసీజీ, టుడీఏకో పరీక్షలు చేశారు. అలాగే 150 కంటికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కనులపండువగా బోనాల సమర్పణ


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కుందూ నది ఒడ్డున వెలసిన శ్రీ జంబలా పరమేశ్వరి దేవి బోనాల మహోత్సవం రెండో రోజు బుధవారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పిండి వంటలతో బోనాలను మహిళలు తలపై ఉంచుకొని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని వెండి చీరలో అలంకరించారు.


ప్రత్యేక అలంకరణలో జంబులా పరమేశ్వరీ దేవి

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


స్వామి అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి బుధవారం పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ వెంకటసుబ్బయ్య

బనగానపల్లె రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని జిల్లా ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య ఆదేశించారు. ఆయన బుధవారం మండలంలోని టంగుటూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీని కలిసిన పలువురు రైతులు.. ప్రస్తుతం వ్యవసాయ పనులు ఎక్కువగా ఉండటంతో వాటికి వచ్చే కూలీల సంఖ్య తక్కువగా ఉందని, ఎక్కువ మొత్తం ఇచ్చి కూలీలను పిలుచుకుంటున్నట్లు చెప్పారు. తద్వారా రైతులకు ఆర్థిక భారం పడుతోందని, కొద్ది రోజులు ఉపాధి పనులు నిలిపివేయాలని పీడీని కోరారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బీవీ రమణ ఆధ్వర్యంలో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఏఏ గ్రామాల్లో ఎంత మంది కూలీలు పనులకు వస్తున్నారు. వారికి ఇచ్చిన టార్గెట్ తదితర వివరాలను టీఏలో రివ్యూ చేశారు. ఏపీఎం రేష్మా, ఈసీ మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.